శనివారం 16 నవంబర్ 2024 https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

అమరావతిలో భూములు కేటాయించిన సంస్థలతో

## సంప్రదింపులు

- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

6

# గత ప్రభుత్వ అప్పులు, తప్పులే రాష్ట్రానికి శాపం

- అడ్డగోలు దోపిడీ కోసం వ్యవస్థల విధ్వంసం
- స్కాముల కోసమే స్కీములు అమలు చేశారు
- ఇప్పటికి తేలింది రూ.9,74,556 కోట్ల అప్పులు, తవ్వితే ఇంకెంత ఉంటాయో?
- అసమర్థ పాలనలో తగ్గిన తలసరి ఆదాయం, పెరిగిన తలసరి ఖర్చు
- సమస్యలు అధిగమించి ఒక్కో ఇటుకా పేర్చుతూ రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం
- రాత్రికి రాత్రే అద్భుతాలు జరుగుతాయని చెప్పడం లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం సహకారంతో ఊపిరిపోశాం
- సూపర్-6 హామీలతో పాటు అదనంగా మరిన్ని పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తాం
- పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటిస్థలం
- కన్నతల్లిపై అసభ్యకర పోస్టింగులు పెట్టించే వాళ్లు మనుషులా, పశువులా?
- సోషల్ మీడియా సైకోల కట్టడికి ప్రత్యేక చట్టం
- గత ప్రభుత్వ అప్పులు, విధ్వంసంపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సుదీర్ఘ వివరణ

2 లో





కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

కేంద్ర మంత్రులతో సానుకూలంగా

## సీఎం చంద్రబాబు చర్చలు

- టీడీపీపీ నేత లావు వెల్లడి

- వివరాలు 6 లో..

## పాపకు ప్రాణం పోసిన పల్లా

- ఆర్థిక సాయం చేసి ఆదుకున్న దాతృత్వం
- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు
- ఎమ్మెల్యే శిరీష అభినందనలు

- వివరాలు 7 లో..



## ఆధునిక సాంకేతికతే ఆలంబన

- అంతర్జాతీయ నగరంగా అమరావతి
- ఐఐటీ మద్రాసుతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందాలు
- అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడమే లక్ష్యం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న 8 విభాగాలు

5

సీఎం చంద్రబాబు, భువనమ్మపై

## అసభ్యకర పోస్టులు

- బాధ్యులను కఠినంగా దండించండి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వెల్లువెత్తిన వినతులు
- అర్జీలు స్వీకరించిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, మాజీ ఎమ్మెల్యే వర్మ

8



## జగన్ అరాచక పాలనతో ఆర్థిక అధోగతి



- దారికి తెచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నాం
- చంద్రబాబు చొరవతోనే గట్టెక్కాలి
- అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

7

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి..

## టీచర్ పోస్టుల భర్తీ

- న్యాయపరమైన చిక్కులు లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్
- గత ప్రభుత్వంలో టీచర్లపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేస్తాం
- ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

4



ప్రైవేటు సంస్థలకు దీటుగా

## ఇంటర్ విద్యలో సంస్కరణలు

- కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కాలేజీల్లో పెరిగిన విద్యార్థులు
- గత ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు
- ఇండస్ట్రీ అవసరాల మేరకు డిగ్రీ కాలేజీలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్

4



## కార్తీక పౌర్ణమి వేడుకల్లో మంత్రి లోకేష్

- మంగళగిరిలో కోటి దీపోత్సవంలో జ్యోతి ప్రజ్వలన
- కాలినడకన వెళ్లి గండాలయ నరసింహస్వామి దర్శనం
- మొక్కులు తీర్చుకుని గండ దీపం వెలిగించిన మంత్రి లోకేష్

5

# గత ప్రభుత్వ అప్పులు, తప్పులే రాష్ట్రానికి శాపం

- అడ్డగోలు దోపిడీ కోసం వ్యవస్థల విధ్వంసం
- స్కాముల కోసమే స్కీములు అమలు చేశారు
- ఇప్పటికి తేలింది రూ.9.74.556 కోట్ల అప్పులు, తవ్వితే ఇంకెంత ఉంటాయో?
- అసమర్థ పాలనలో తగ్గిన తలసరి ఆదాయం, పెరిగిన తలసరి ఖర్చు
- సమస్యలు అధిగమించి ఒక్కో ఇటుకా పేర్చుతూ రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం
- రాత్రికి రాత్రే అద్భుతాలు జరుగుతాయని చెప్పడం లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం సహకారంతో ఊపిరిపోశాం
- సూపర్-6 హామీలతో పాటు అదనంగా మరిన్ని పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తాం
- పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటిస్థలం
- కన్నతల్లిపై అసభ్యకర పోస్టింగులు పెట్టించేవాళ్లు మనుషులా, పశువులా?
- సోషల్ మీడియా సైకోల కట్టడికి ప్రత్యేక చట్టం
- గత ప్రభుత్వ అప్పులు, విధ్వంసంపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సుదీర్ఘ వివరణ



అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వ తప్పులు, అప్పులు, పాపాలు, నేరాలే రాష్ట్రానికి శాపంగా మారాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అసమర్థ పాలన, అభివృద్ధి నిరోధక నిర్ణయాలు, ప్రజా సంపద దోపిడీ, పన్నుల బాదుడు, స్కాముల కోసమే స్కీములు పెట్టి చరిత్రలో లేని విధంగా రాష్ట్రాన్ని దోచేశారన్నారు. ప్రజల ఆశలు నెరవేర్చాలంటే మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉంది. రాత్రికి రాత్రే అద్భుతాలు జరుగుతాయని అనుకోవడం లేదు. ఒక్కో ఇటుకా పేర్చుతూ ముందుకెళ్తున్నాం. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి కేంద్ర సహకారంతో ఊపిరి పోస్తున్నామన్నారు. బడ్జెట్‌పై శాసనసభలో శుక్రవారం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర అప్పులు, గత ప్రభుత్వ తప్పులు, నేరాలు, విధ్వంసంపై సుదీర్ఘంగా వివరించారు.

## ప్రజల నమ్మకాన్ని నూటికి నూరు శాతం నిలబెడదాం

ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలే. వారి కోసం పని చేయాల్సిన బాధ్యత పాలకులుగా మాపై ఉంది. మొన్నటి ఎన్నికల్లో ప్రజలు పెను విప్లవంలా ఓట్లేసి మమ్మల్ని గెలిపించారు. ప్రజలు గెలిస్తే రాష్ట్రం నిలదొక్కుకుంటుంది...ప్రజలు గెలవాలంటే ఎన్డీయేను గెలిపించాలని ఎన్నికల ముందు ప్రజల్ని కోరాం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని పిలుపునిస్తే జనం ముందుకొచ్చి ఓట్లేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముందు నుంచీ చెపుతూనే ఉన్నారు. బీజేపీ కూడా వచ్చి కలవడంతో మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్ల 93 శాతం స్ట్రైక్ రేట్ తో సీట్లు సాధించాం. ఇది ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకానికి తార్కాణం. నూటికి నూరు శాతం ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం. 1995లో సీఎం అవ్వకముందు ఏడాది పాటు ఆర్థిక శాఖ మంత్రిగా చేశాను. ఆనాడు కూడా ఇప్పుడున్నటు వంటి దారుణ పరిస్థితులు లేవు. నాడు కూడా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. సవాల్‌గా తీసుకుని పాలన కొత్తపుంతలు తొక్కించాం. 1995 నాటి పాలన ఒక మోడల్. కష్టాల నుండి బయటకు తీసుకురావడమే కాకుండా రాష్ట్రానికి గట్టి పునాది వేసి ముందుకెళ్లాం. 2014లో విభజన జరిగిన తీరు మనమంతా చూశాం. రాష్ట్రానికి ఆదాయం లేదు, కనీసం పెన్షన్లు...జీతాలు వస్తాయా అని భయపడిన రోజులు ఉన్నాయి. 2014లో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేశాయి. ప్రజల సహకారంతో, అనుభవంతో సమర్థవంతంగా పని చేశాం. 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉంటే అధిగమించి మిగులు విద్యుత్ సాధించాం. ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదు. రాష్ట్ర విభజనతో రాజధాని లేని పరిస్థితి ఏర్పడింది. 33 వేల ఎకరాలను 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాజధాని నిర్మాణం కోసం ఇచ్చారు. 72 శాతం మేర పోలవరాన్ని పూర్తి చేశాం...టీడీపీ ప్రభుత్వం మళ్లీ వచ్చి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేది. 13.5 శాతం గ్రోత్ రేట్ సాధించాం. పెట్టుబడులు, పథకాలు, పాలసీలతో దేశ దృష్టిని ఆకర్షించాం. కానీ 2019లో ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు విధ్వంసం సృష్టించారు. ఆ విధ్వంస పరిస్థితులు అర్థం చేసుకోవడానికే నాలుగైదు నెలల సమయం పట్టింది. కనీసం ఒక్క శాఖపైనా శ్వేతపత్రాలు విడుదల చేయకపోవడమే కాకుండా కాగ్‌కు కూడా లెక్కలు ఇవ్వలేదు. ఆడిటింగ్ చేయించకుండా ఇష్టానుసారంగా చేశారు. రాష్ట్రంలో విభజన వల్ల జరిగిన నష్టం కంటే గత ఐదేళ్లలోనే ఎక్కువ జరిగింది. విధ్వంసం, అరాచకాలు, అసమర్థ, చీకటి పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కివెళ్లేలా చేశారు. రాష్ట్ర బ్రాండ్‌ను కూడా దెబ్బతీశారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ప్రజల కోసం పని చేసి ప్రజల పక్షాన నిలబడ్డామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## దొరికిన కాడికి దోచేశారు

గత ప్రభుత్వం వ్యవస్థలను విధ్వంసం చేస్తూనే వినూత్న విధానాల్లో దోపిడీ చేసింది. రాజకీయ నాయకుడు ఇలా కూడా దోపిడీ చేసి తప్పించుకుంటారని కలలో కూడా అనుకోలేదు. దొరికినకాడికి దోచేశారు. తప్పుడు పనులకు వ్యవస్థలను వాడుకుని నాశనం చేశారు. ప్రజాధనాన్ని దుబారా చేశారు. రాజధాని నిర్మాణం ఆపేశారు. మేటి నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుందని అందరూ అనుకున్నారు. లక్ష కోట్లు ఖర్చు అవుతుందని గత పాలకులు తప్పుడు ప్రచారం చేశారు. ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు....రైతులు ఇచ్చిన భూముల్లో 10 వేల ఎకరాలు మిగులుతుంది. దాన్ని విక్రయిస్తే రాజధాని నిర్మాణం జరిగిపోతుందని చెప్తే వినిపించుకోలేదు. రాష్ట్ర జీవనాడి పోలవరంను పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి కరవు రాదనే ఉద్దేశంతో 2014-19 మధ్య పని చేశాం. కానీ వైసీపీ పాలకులు డయాఫ్రం వాల్‌ను దెబ్బతీసి ప్రాజెక్ట్‌ను పడుకోబెట్టారు. నిర్మాణ ఏజెన్సీని, అధికారులను మార్చి ప్రాజెక్టును గాలికొదిలేశారు. రెండేళ్ల పాటు ప్రాజెక్టును అసలు పట్టించుకోలేదని సీఎం చంద్రబాబు తప్పుబట్టారు.

## విద్యుత్ రంగంలో రూ.1.29 లక్షల కోట్ల నష్టం

ప్రభుత్వ టెర్రరిజంతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు దారుణంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోని పరిశ్రమలు తరలిపోయాయి. విద్యుత్ రంగంలో రూ.1.29 వేల కోట్ల మేర నష్టం వాటిల్లింది. సోలార్, విండ్ పవర్ సంస్థలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం విద్యుత్ తీసుకోలేదు. కోర్టు తీర్పుతో రూ.9వేల కోట్లు అపరాధంగా ఇవ్వాల్సి వచ్చింది. రూ.7.91 పైసలు పెట్టి బయట మార్కెట్‌లో విద్యుత్ కొన్నారు. తప్పుడు నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేశారు. ఇసుకలో దోపిడీకి పాల్పడి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశారు. ఇసుకలో రూ.30వేల కోట్లు దోచుకున్నారు. ఇక మద్యం పాలసీ అయితే ఇప్పటికీ అర్థం కావడం లేదు. మద్యం తయారు చేసే కంపెనీలను బెదిరించి బలవంతంగా లాక్కుని సొంత బ్రాండ్లు తయారు చేశారు. వాళ్లే తయారుచేసి, షాపులకు పంపిణీచేసి, అమ్మకం కూడా వాళ్లే చేశారు. ఆన్ లైన్ నగదు విధానం లేకుండా చేశారు. కలెక్షన్ సొమ్ము మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చేది. మొన్నటి వరకు రాష్ట్రంలో సైకో బ్రాండ్స్ దొరికేవి. కానీ ఇప్పుడు ప్రపంచంలోని అన్ని బ్రాండ్లు లభిస్తున్నాయి. సంపద పెంచడం చేతకాక విపరీతంగా పన్నులు పెంచేశారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీశారు. శాంతి, భద్రతలు కూడా దిగజార్చారు. ప్రజాస్వామ్యం సిగ్గుపడేలా పోలీస్ వ్యవస్థను ఉపయోగించారు. ఆస్తులను ధ్వంసం చేశారు. తోటలు నరికేశారు. భూములు కబ్జా చేశారు. భూములను 22ఏ జాబితా లో చేర్చి..అధికార పార్టీ నేతల పేర్ల మీద భూములను మార్చుకోగానే ఆ జాబితా నుండి తొలగించి దోపిడీకి పాల్పడ్డారు. కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను... వేధించి, పిచ్చివాణ్ణి చేసి నడిరోడ్డుపై పడేసి చనిపోయేలా చేశారు. ఆయనను కాపాడాలని ఎంత ప్రయత్నించినా కాపాడలేకపోయామని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఐదేళ్లలో మూలధన వ్యయం సున్నా

ఐదేళ్లలో మూలధన వ్యయం తగ్గించారు. రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలు పడిపోయాయి. ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా గుంతల పూడ్చివేతకు ఖర్చు చేయలేదు. వ్యక్తి ఐపీ పెడితే అప్పులోళ్లు వచ్చినట్లు ఏపీ పరిస్థితి తయారైంది. ఆర్థిక ఉగ్రవాదం సృష్టించారు. పొలానికి అడవి పందులు వస్తాయి... తిన్నంత తిని పోతూ పోతూ మిగిలిన పంటను నాశనం చేసి వెళ్తాయి. రాష్ట్ర పరిస్థితిని కూడా గత పాలకులు అదే విధంగా మార్చారు. అడవి పందులు విధ్వంసం చేస్తే మళ్లీ పంట వేసుకునే అవకాశం ఉంటుంది. కానీ గత పాలకులు చేసిన విధ్వంసంతో ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. ప్రజలు నమ్మి ఓట్లేసినందుకు దుర్మార్గంగా వ్యవహరించారు. ఆదాయం సృష్టించడానికి ఒక్క పని కూడా చేపట్టలేదు. పెట్టుబడులు పెట్టేవారిని తరిమేశారు. రాష్ట్రంపై నమ్మకం కోల్పోయేలా చేశారు. ఎన్డీయే గెలవకపోతే ఉన్న రెండుమూడు ఎకరాల భూమి అమ్ముకుని వెళ్లిపోయే పరిస్థితి ఉండేదని ప్రజలు భావించారు. అరాచక పాలన నుంచి విముక్తి కోసం ప్రపంచంలోని తెలుగువారంతా ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు వేశారని సీఎం చంద్రబాబు అన్నారు.

## సొంత పత్రికకు ప్రజాధనం తగలేశారు

రూ.430 కోట్లతో రుషికొండపై ప్యాలెస్ నిర్మించుకున్నారు. ఆ భవనాలు చూసి నాకే కళ్లు తిరిగాయి. ప్రభుత్వ ధనంతో ప్యాలెస్‌లు కడతారా? సిగ్గూఎగ్గూ లేకుండా కుటుంబ సభ్యులకు కూడా ప్యాలెస్‌లు కట్టుకున్నారు. రుషికొండపై 7 బ్లాకులు కట్టారు. పర్యావరణాన్ని విధ్వంసం చేశారు. ఎన్జీటీ, హైకోర్టు, సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టులను మభ్యపెట్టారు. కోట్లు కుమ్మరించి ప్యాలెస్ కట్టుకున్నారు కానీ దానిలోకి వెళ్లలేకపోయారు. రూ.750 కోట్లతో సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకున్నారు. వాటిని తొలగించడానికి రూ.30 కోట్ల దాకా ఖర్చు అయింది. ప్రభుత్వ కార్యాలయాలకు రంగులు వేశారు. కోర్టు ఆదేశాలతో వాటిని తొలగించడానికి వేల కోట్లు తగలేశారు. రూ.400 కోట్లు సొంత పత్రిక సాక్షికి ప్రకటనల రూపంలో ఇచ్చుకున్నారు. ప్రజాధనంతో వాలంటీర్ల ద్వారా సాక్షి పత్రికను కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చుకున్నారని సీఎం చంద్రబాబు ఆక్షేపించారు.

## కన్నతల్లిపై అసభ్యకర పోస్టింగులు పెట్టించే వాళ్లు మనుషులా... పశువులా..?

ఇక సోషల్ మీడియా సైకోలను తయారు చేశారు. కన్నతల్లిపైనా అసభ్యకర పోస్టింగులు పెట్టించే పరిస్థితికి వచ్చారంటే ఏమనుకోవాలి.? కన్నతల్లి శీలాన్ని శంకించే పరిస్థితి ఉందంటే వాళ్లు మనుషులా...పశువులా? తల్లి వ్యక్తిత్వాన్నే హననం చేసేవారికి మనం ఒక లెక్కా? ఎన్డీయే కూటమిలోని నేతలు, కార్యకర్తలు ఎవరూ అసభ్య పోస్టులు పెట్టరు...ఒకవేళ పెడితే కఠినంగా శిక్షిస్తాం. ఆడబిడ్డలు గౌరవంగా బతికేలా చేస్తాం. రాబోయే రోజుల్లో ఏ ఆడబిడ్డా అవమాన పడటానికి వీల్లేదు. చట్టానికి పదును పెట్టి కఠినంగా వ్యవహరిస్తాం. వ్యవస్థీకృత నేరాలు చేశారు. రాజకీయంలో అవినీతి చూసి ఉంటాం...కానీ అవినీతి, అక్రమాల కోసమే రాజకీయాల్లోకి వచ్చిన వారిని చూస్తున్నాం. టీడీపీ స్థాపించి 45 ఏళ్లు అయింది...ఇప్పటికీ మాకు టీవీ, పేపరు లేవు. కానీ వాళ్లు అధికారంతో అవన్నీ ఏర్పాటు చేసుకున్నారు. రైతు బజార్లు, తహసీల్దార్ కార్యాలయాలు తాకట్టు పెట్టారు. మద్య నిషేధం అని చెప్పి అధికారంలోకి వచ్చి తరువాత మద్యంపై ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చారు. కేంద్ర నిధులు దారి మళ్లించారు. పేదల పథకాలకు గండికొట్టారు. 2019కి ముందు లోకేష్ 24 వేల కి.మీ సిమెంట్లు రోడ్లు వేయించారు...కానీ గత ఐదేళ్లు ఏం చేశారో తెలీదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.4,500 కోట్లతో 30 వేల పనులకు శ్రీకారం చుట్టారు. జల్ జీవన్ మిషన్ గొప్ప కార్యక్రమం. ప్రతి ఇంటికి నీరివ్వడం ఈ పథకం లక్ష్యం. 45 శాతం మేర కేంద్రం నిధులు ఇస్తుంది. దాన్ని కూడా అస్తవ్యస్థం చేశారు. ప్రయోగాలతో విద్యా వ్యవస్థను నాశనం చేశారు. స్కూళ్లు విలీనం చేయడం వల్ల డ్రాప్ అవుట్ రేట్ పెరిగింది. ఇంగ్లీష్ మీడియం వాళ్లే ప్రవేశపెట్టినట్లు... అంతకు ముందు లేనట్లు ప్రవర్తించారు. ఎవరైనా మాట్లాడితే పేదల వ్యతిరేకులుగా చిత్రీకరించారు. వైద్య, వ్యవసాయ, అన్ని రంగాలను చిన్నచూపు చూసి నాశనం చేశారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు.

## తేలింది రూ.9.74.556 కోట్ల అప్పులు... తవ్వితే ఇంకెంత ఉంటాయో

అప్పులు ఎక్కడున్నాయని మాట్లాడుతున్నారు. ప్రభుత్వ అప్పులు రూ.4.35 లక్షల కోట్లు ఉన్నాయి. పబ్లిక్ అకౌంట్స్ లయబిలిటీస్ రూ.80,914 కోట్లు, కార్పొరేషన్ అప్పులు రూ.2,48,670 కోట్లు, సివిల్ సప్లయిస్ శాఖలో రూ.36 వేల కోట్లు, విద్యుత్ రంగంలో రూ.34,267 కోట్లు, చెల్లించాల్సిన బకాయిలు రూ.1,13,244 కోట్లు, ఉద్యోగులకు రూ.21,980 కోట్లు, నాన్ కాంట్రిబ్యూషన్ సింకింగ్ ఫండ్ కింద రూ.1,191కోట్లు...ఇవన్నీ కలుపుకుంటే రూ.9,74,556 కోట్లు అప్పులు ఉన్నాయి. ఇది అబద్ధం అని ఎవరు వచ్చినా లెక్కలు చూపించి గుంజీళ్లు తీయిస్తా. జీవోలు ఆన్ లైన్ లో లేకుండా చేస్తే తిరిగి ఆన్ లైన్ విధానం ప్రవేశపెట్టాం. గడిచిన ప్రభుత్వం దాచి పెట్టిన చీకటి జీవోలను కూడా ఆన్ లైన్‌లో పెట్టాం. 2014-19 మధ్య 6 పైసలు ఎలక్ట్రిసిటీ డ్యూటీ వేశాం...ఆ డబ్బులు కూడా బోర్డుకే వెళ్లేవి. కానీ గత ప్రభుత్వం రూపాయికి పెంచి ప్రభుత్వమే తీసుకుంది. వాటర్ టారిఫ్ కిలో లీటర్‌కు రూ.40ల నుండి రూ.120కి పెంచారు. ఇసుక మేము ఉచితంగా ఇస్తే టన్ను రూ.470లకు అమ్ముకున్నారు. ఆర్థిక లోటు రూ.35,440 కోట్ల నుండి రూ.59,995 కోట్లకు పెంచారు. తలసరి ఖర్చు 2019కి ముందు రూ.74,790 ఉంటే 2023-24 నాటికి రూ.1,44,336కు పెరిగింది. అప్పులు, ఖర్చులు పెరిగి ప్రజల ఆదాయం తగ్గింది. తలసరి ఆదాయం గ్రోత్ రేట్ 13.2 శాతం నుండి 9.5 శాతానికి తగ్గింది. ఇండస్ట్రియల్ క్రెడిట్ గ్రోత్ రేట్ 15.3 శాతం నుండి 6.8 శాతానికి తగ్గింది. దేశంలోనే ఎక్కువగా వ్యవసాయంలో 16.6 శాతం గ్రోత్ రేట్ ను మేము సాధిస్తే వారొచ్చాక 10.5 శాతానికి తగ్గిపోయింది. మొత్తంగా 13.5 గ్రోత్ రేట్ ఉంటే దాన్ని 10.6 శాతానికి దిగజార్చారు. 3 శాతం గ్రోత్ రేట్ తగ్గితే రూ.6.94 లక్షల కోట్ల కోట్ల ఆదాయం తగ్గిపోతుంది. ఇప్పటికీ 13.5 శాతం గ్రోత్ రేట్ ఉంటే రూ.76,195 కోట్ల అదనపు ఆదాయం వచ్చేది. రూ.76 వేల కోట్లతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు. 2018-19 నాటికి తెలంగాణ కంటే మన రాష్ట్ర జీఎస్డీపీ రూ.17 వేల కోట్లు ఎక్కువ సాధించాం. 2023-24 నాటికి తెలంగాణ మన రాష్ట్రం కంటే రూ.62 వేల కోట్లు అధికంగా సాధించింది. అంటే ఏపీ ఆదాయం కంటే తెలంగాణ ఎక్కువ సాధించింది. ఇది గత పాలకుల అవినీతి, అసమర్థత కాక మరేమిటి? తలసరి ఆదాయంలో ఏపీ, తెలంగాణ మధ్య వ్యత్యాసం 2018-19 నాటికి రూ.55 వేలు ఉంటే 2023-24 నాటికి రూ.1.14 లక్షలకు చేరింది. తలసరి ఆదాయం పెరగలేదు, వృద్ధి రేటు లేదు. బటన్ నొక్కితే ప్రజలకు ఏమైనా వచ్చిందా...

- (మిగతా వివరాలు 4లో)

ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

విజనరీ లీడర్ మన చంద్రన్న




## గ్రామీణ వికాసం

1. పంచాయితీలకు రాజ్యాంగంలో వున్న 29 అధికారాలల్లో 17 బదిలీ చేశారు
2. సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు గౌరవ వేతనం
3. స్థానిక ఆదాయ వనరుల్లో పంచాయితీలకు వాటా
4. 2002 గ్రామ సచివాలయాల కాన్సెప్ట్ ప్రవేశ పెట్టారు
5. జన్మభూమి, శ్రమదానం
6. చెరువుల అభివృద్ధి
7. ఉపాధి హామీ నిధులు వినియోగించి రికార్డు స్థాయిలో 32 వేల కి.మీ. సిమెంట్ రోడ్లు నిర్మాణం
8. కేంద్ర ఆర్థిక సంఘల నిధుల్ని ఇవ్వడంతో పాటు రాష్ట్ర నిధులు కూడ పంచాయితీలకు విడుదల
9. ప్రజాస్వామ్య బద్ధంగా, స్వేచ్ఛగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు



### వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి..

# టీచర్ పోస్టుల భర్తీ



- న్యాయపరమైన చిక్కులు లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్
- గత ప్రభుత్వంలో టీచర్లపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేస్తాం
- ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. శాసనసభలో శుక్రవారం డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, లోకం మాధవి, కాకర్ల సురేష్ అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారన్నారు. న్యాయపరంగా ఎటువంటి చిక్కులు లేకుండా టీచర్ పోస్టులు భర్తీచేయాలన్నదే తమ లక్ష్యం అని తెలిపారు. 1994నుంచి కేసుల వివరాలు తెప్పించాం, పకడ్బందీగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించాం. టీచర్ పోస్టుల భర్తీకి చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నాం. డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి సడలింపునకు సంబంధించిన ఫైలు సీఎం వద్ద ఉంది, అక్కడ నుంచి ఫైలు వచ్చాక ఎంత సడలింపు ఇవ్వాలో నిర్ణయిస్తాం. 1994కి ముందు జిల్లాపరిషత్ ఆధ్వర్యంలో టీచర్స్ రిక్రూట్‌మెంట్ జరిగేది. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే 15 డీఎస్సీలు నిర్వహించాం, 2.20 లక్షల పోస్టులు నోటిఫై చేసి, 1.80 లక్షల పోస్టులు భర్తీచేసింది టీడీపీ ప్రభుత్వాలే. ఇదొక చరిత్ర. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ ద్వారా భర్తీచేసిన టీచర్ పోస్టులు సున్నా. నిరుద్యోగులను మభ్యపెట్టడానికి ఎన్నికలకు రెండునెలల ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన హడావుడిగా 6,100 పోస్టులతో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు. నిరుద్యోగులను మభ్యపెట్టడానికే ఎన్నికలకు ముందు తూతూ మంత్రంగా నోటిఫికేషన్ ఇచ్చారు. జీఓ 117 తెచ్చి స్కూళ్ల విలీనం పేరుతో గత ప్రభుత్వం పేద విద్యార్థులు, టీచర్లను ఇబ్బందులకు గురిచేసింది. సమాజంలో మార్పునకు కారణమైన టీచర్లను గత ప్రభుత్వం పనిగట్టుకొని వేధించింది. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తెచ్చే క్రమంలో టీచర్లను భాగస్వాములను చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్కూళ్లలో 6 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంచాల్సి ఉంది. జీఓ 117పై ఉపాధ్యాయ సంఘాలతో కమిషనర్ మాట్లాడుతున్నారు, వాస్తవాలను తెలుసుకుంటున్నాం. జీఓ 117కి ప్రత్యామ్నాయం తెస్తాం. ఉపాధ్యాయులపై వేధింపులు ఉండకూడదు. గతంలో తమ సమస్యలపై ఉపాధ్యాయులు ధర్నాలు చేసినపుడు దొంగకేసులు పెట్టారు. డీజీపీతో మాట్లాడి ఆ కేసులన్నీ ఎత్తేస్తాం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మానిటరింగ్ మేనేజ్ మెంట్ సిస్టమ్ తెస్తాం. రాబోయే ఐదేళ్లలో దేశానికే తలమానికంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ విధానం తీసుకువస్తామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

### గత ప్రభుత్వ అప్పులు,

## తప్పులే రాష్ట్రానికి శాపం

2వ పేజీ తరువాయి

అప్పులు మాత్రం పెరిగాయని సీఎం చంద్రబాబు వివరించారు.

**ఆస్తుల సృష్టి జరగలేదు... బటన్లు నొక్కేందుకు అప్పులు తెచ్చారు**

అమరావతి, పోలవరం, విద్యుత్ రంగాలను విధ్వంసం చేశారు. ఐదేళ్లుగా పెట్టుబడి దారుల్లో నమ్మకం పోయింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏమీ కల్పించలేదు. ఐదేళ్ల పాటు రాష్ట్రం విష వలయంలో చిక్కింది. ఆస్తుల సృష్టి లేదు...ఆదాయం పెరగలేదు. ఆదాయం తగ్గింపుతో పాటు పన్నులు పెంచారు. బటన్లు నొక్కేందుకు అప్పులు తెచ్చారు...ఆస్తులు తాకట్టు పెట్టారు. మేము అధికారంలోకి రాగానే 7 శ్వేత పత్రాలు విడుదల చేశాం. స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపకల్పన చేశాం. ప్రజలు 21 మంది ఎంపీలను గెలిపించడంతో ఢిల్లీలో పలుకుబడి పెరిగింది. కేంద్ర సహకారం లేకుంటే రాష్ట్రం ఏమయ్యేదో తెలిసేది కాదు. రాష్ట్రాన్ని వెంటిలేటర్ నుండి ఇప్పుడే బయటకు తీశాం. 150 రోజుల్లో ఎన్నో పథకాలు, నిర్ణయాలు, పాలసీలు తెచ్చాం. సంపద సృష్టించి, ఉపాధి మార్గాలు పెంచేందుకు ముందుకెళ్తున్నాం. ఏ రాష్ట్రంలో లేని విధంగా 6 పాలసీలు తెచ్చాం.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకెళ్తున్నాం. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 5 హామీల అమలుపై సంతకం చేశాం. 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. రూ.4 వేలు సామాజిక పెన్షన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఏపీ. ధనిక రాష్ట్రాలు కూడా ఇవ్వడం లేదు. గత పాలకులు అన్న క్యాంటీన్లను కూడా నాశనం చేశారు. పేద వాడికి అన్నం పెట్టడాన్ని కూడా ఓర్చుకోలేకపోయారు. నూతన మద్యం పాలసీ, ఇసుక పాలసీ తెచ్చాం. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఈ పాలసీలను సమర్ధవంతంగా అమలయ్యేలా బాధ్యత తీసుకోవాలి. అందరం ప్రజల మనోభావాల ప్రకారం పని చేయాలని సీఎం చంద్రబాబు హితవు పలికారు.

**నేరస్తుల రాజకీయ ముసుగు తొలగిస్తాం**

నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విదానంతో వెళ్తాం. రాజకీయ ముసుగులో నేరాలు చేయాలనుకునే వారి ముసుగు తొలగిస్తాం. సభకు వైసీపీ ఎమ్మెల్యేలు రాకపోవచ్చు... కానీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. త్వరలో టూరిజం పాలసీ కూడా తీసుకొస్తాం. అమరావతి, పోలవరాన్ని పట్టాలెక్కించాం. గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు ఉండదు. సూపర్-6 లో ఇచ్చిన దీపం-2 పథకం అమలు చేశాం. 48 గంటల్లోనే సిలిండర్ కు డబ్బులు అందిస్తున్నాం. లబ్ధిదారులకు నేరుగా అందించే విధానాన్ని త్వరలో తీసుకొస్తాం. 150 రోజుల్లో లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టాం. రూ.860 కోట్లతో రోడ్లపై గుంతలు పూడ్చుతున్నాం. గౌడ కులస్థులకు 10 శాతం మద్య షాపులు కేటాయించాం. ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.10 వేలకు పెంచాం. వేద విద్య అభ్యసించిన వారికి రూ.3 వేలు భృతి అందిస్తున్నాం. గత పాలకులు రైతులకు పెట్టిన రూ.1670 కోట్ల బకాయిలు చెల్లించాం. పాడి రైతులకు 90 శాతం రాయితీతో షెడ్లు నిర్మిస్తున్నాం. కొప్పర్తి, ఓర్వకల్లు, నక్కపల్లి, కృష్ణపట్నం ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నాం. ఓర్వకల్లులో 300 ఎకరాలు డ్రోన్ హబ్‌కు కేటాయించాం. విశాఖలో రైల్వే జోన్‌కు భూమి కేటాయించాం..త్వరలో ప్రధాని మోదీ భూమి పూజ చేస్తారు. డిసెంబరులో లక్ష ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహిస్తాం. గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటి జాగా ఇస్తాం. సంపద సృష్టించి ఆదాయం పెంచి, మళ్లీ పేదల సాధికారతకు ఖర్చు చేస్తాం. సూపర్ 6 హామీలను పూర్తిగా నెరవేర్చడమే కాదు..అదనంగా మరిన్ని పథకాలు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### ప్రైవేటు సంస్థలకు దీటుగా

## ఇంటర్ విద్యలో సంస్కరణలు

- కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కాలేజీల్లో పెరిగిన విద్యార్థులు
- గత ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు
- ఇండస్ట్రీ అవసరాల మేరకు డిగ్రీ కాలేజీలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్మీడియట్ విద్యలో పలు సంస్కరణలు తెస్తున్నాం.. గత ప్రభుత్వంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు.. నేను మంత్రి అయ్యాక తొలిసారి పాఠ్యపుస్తకాలు ఇచ్చామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. శాసనసభలో శుక్రవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... గత ప్రభుత్వ హయాంలో ఇంటర్మీడియట్‌కు హైస్కూలు ప్లస్ కాలేజీలు తెచ్చారన్నారు. ఇంటర్మీడియట్, స్కూలు ఎడ్యుకేషన్‌కు చాలా తేడా ఉంటుంది. సరైన అధ్యాపక సిబ్బంది లేకుండా కాలేజీలు ప్రారంభించటం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 15 వేల అడ్మిషన్లు పెరిగాయి, ఇది శుభ పరిణామం. విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించి వెనుకబడిన విద్యార్థుల కోసం బ్రిడ్జి కోర్సులు ఏర్పాటు చేస్తున్నాం. నారాయణ సంస్థలతో పోటీపడేలా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలని కృషిచేస్తున్నాం. ఇందుకోసం మంత్రి నారాయణను ఇన్‌పుట్స్ అడిగాం. గురువారం జరిగిన ఒక వర్క్ షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి సలహాలు, సూచనలు ఇచ్చారు. స్కూలు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో భవనాలు, ఫ్యాకల్టీ, మెటీరియల్‌పై సమీక్షించాం. రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లకు ర్యాంకింగ్ మెకానిజం తెచ్చి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తాం. ఫలితాలపై ఎప్పటికప్పుడు సమీక్షించి, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించాం. డిసెంబర్ మొదటివారంలో రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహిస్తాం. ఆ సమావేశాల్లో శాసనసభ్యులంతా పాల్గొనాలని కోరుతున్నాం. ప్రతి ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఫీడ్‌బ్యాక్ రిపోర్టు ఇవ్వాలని కోరుతున్నా. ఏం చేస్తే బాగుంటుందో ఎమ్మెల్యేలు ఇచ్చే సలహాల మేరకు చర్యలు తీసుకుంటాం. తగరపువలస డిగ్రీ కాలేజీ కేజీబీవీ స్కూలులో నడుస్తోంది. త్వరలో ప్రత్యామ్నాయం చూపిస్తాం, అప్పటివరకు అక్కడే కొనసాగిస్తాం. సింహచలం స్కూలు భవనాల నిర్మాణాన్ని ఆరునెలల్లో పూర్తిచేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 169 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి, 49 నియోజకవర్గాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేవు. 91 నియోజకవర్గాల్లో ఒకటి, 27 చోట్ల రెండు, 8చోట్ల 3 డిగ్రీ కాలేజిలు ఉన్నాయి. భీమిలి నియోజకవర్గంలో రెండు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి, భీమిలిలో అడ్మిషన్ రేటు 73శాతం ఉండగా, తగరపువలసలో 36 శాతం మాత్రమే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజిల్లో అడ్మిషన్లు 50 శాతం దాటడం లేదు, ఐటిఐకి మాత్రం డిమాండ్ ఉంది. ఫ్యాకల్టీ, భవనాలు, మీడియం కరెక్టుగా లేకపోవడమే అడ్మిషన్ల తగ్గుదలకు కారణం. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కాలేజీలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## ప్రతిభామూర్తులకు ఎన్టీఆర్ స్కాలర్‌షిప్

**వచ్చేనెల 8న బాలికలకు అర్హత పరీక్ష**

**నారా భువనేశ్వరి వెల్లడి**

అమరావతి(చైతన్యరథం): ఎన్టీఆర్ విద్యా సంస్థలు గత పది సంవత్సరాలుగా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గెస్ట్ ఉపకార వేతన అర్హత పరీక్ష వచ్చే నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలియ చేశారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఎన్టీఆర్ విద్యాసంస్థల ద్వారా ఉపకారవేతనం అందజేయ నున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ క్రమంలో మొదటి పది ర్యాంకులు పొందిన బాలికలకు నెలకు 5 వేల రూపాయల చొప్పున, తరువాతి పదిహేను ర్యాంకులు పొందిన బాలికలకు నెలకు 3వేల రూపాయల చొప్పున ఎన్టీఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు పూర్తిచేసే వరకు ఇవ్వనున్నట్లు భువనేశ్వరి స్పష్టం చేశారు. ఈ సదవకాశాన్ని పదవ తరగతి చదువుతున్న బాలికలందరూ వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

చైతన్యరథం

# ఆధునిక సాంకేతికతే ఆలంబన

- అంతర్జాతీయ నగరంగా అమరావతి
- ఐఐటీ మద్రాసుతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందాలు
- అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడమే లక్ష్యం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న 8 విభాగాలు



అమరావతి (చైతన్యరథం): అమరావతిని అంతర్జాతీయస్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు వివిధ రంగాల్లో అధునాతన సాంకేతికత, పరిశోధనల ఫలాలను రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు దేశంలోనే పేరెన్నికగన్న రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఐఐటీ మద్రాస్‌తో ఏపీ ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, అత్యాధునిక పరిశోధనలు నిర్వహించడం, సమాజానికి ప్రయోజనం చేకూర్చే సామాజిక సంబంధిత కార్యకలాపాల్లో ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాలని ఐఐటీ మద్రాసు (ఐఐటీ ఎం) నిర్ణయించింది. ఐఐటీఎం ప్రతినిధులతో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ మేరకు జరిగిన చర్చలు ఫలవంతమయ్యాయి. సాయంత్రం మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఐఐటీ మద్రాసు, ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ఉన్నతాధికారులు కృతికా శుక్లా, విజయ రామరాజు, యువరాజ్, కన్నబాబు, ఐఐటీ మద్రాసు డైరెక్టర్ ప్రొఫెసర్ విజినాథన్ కామకోటి, డీన్ ఆఫ్ ప్లానింగ్ రామానుజం సారథి, ఎంజె శంకర్ రామన్ (సీఈఓ, ఐఐటీఎం ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్), ప్రొఫెసర్ మహేష్ పంచాగ్నుల (మాజీ డీన్, ఐఐటీఎం కార్పొరేట్ రిలేషన్స్), ప్రొఫెసర్ రవీంద్రన్ (హెడ్, సెంటర్ ఫర్ రెస్పాన్సిబిల్ ఏఐ), రాజేష్ (ఐఐటీఎం అల్యూమినస్), చెన్నయ్ సీఎంఓ అధికారి రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీఎం- ఏపీ సీఆర్‌డీఏ

అమరావతిలో అంతర్జాతీయ డీప్‌టెక్ పరిశోధన, డిజైన్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ పార్క్ ఏర్పాటులో సాంకేతిక సలహా కోసం ఈ ఒప్పందం కుదిరింది. అమరావతిని అంతర్జాతీయస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఫిజికల్, వర్చువల్ పద్ధతుల్లో ఐఐటీఎం సంస్థ ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేస్తుంది.

## మారిటైమ్ బోర్డు

సముద్ర పరిశోధన, కమ్యూనికేషన్, కోస్టల్ ఎనర్జీ హార్వెస్టింగ్ టెక్నాలజీల కోసం ఐఐటీఎం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పరిశోధనతోపాటు కన్సల్టెన్సీ, విద్య, శిక్షణ ప్రయోజనాలను సాధించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం.



## ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్

స్వయం ప్లస్, ఐఐటీఎం ప్రవర్తక్ డిజిటల్ స్కిల్ అకాడమీ వంటి ప్లాట్ ఫారాల ద్వారా స్కేల్ స్కిల్లింగ్ కార్యక్రమాల్లో నాణ్యత పెంచేలా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

## అధునాతన సాంకేతిక శిక్షణ కోసం విద్యాశాఖ

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక శిక్షణ ఇచ్చేలా ఐఐటీఎం, ఏపీ విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఐఐటీఎం ప్రవర్తక్ విద్యాశక్తి ద్వారా ఏపీలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఐఐటీఎం సాంకేతిక శిక్షణ ఇస్తుంది. ఇందుకు అవసరమైన మార్గదర్శక కార్యక్రమాలను ప్రారంభిస్తుంది.

## ఐఐటీఎం- ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ శాఖ

విమానాశ్రయాలను లాజిస్టిక్స్ /మెయింటెనెన్స్ హబ్‌లుగా మార్చే లక్ష్యంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముఖ్యంగా కుప్పం, పుట్టపర్తి విమానాశ్రయాలపై దృష్టిసారించడం, ఆయా ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలను గుర్తించి అభివృద్ధి చేయడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం.

## ఇంటర్నెట్ గేట్‌వేగా విశాఖ

అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతికతను ఉపయోగించి విశాఖ మహానగరాన్ని ఇంటర్నెట్ గేట్‌వేగా అభివృద్ధి చేయడం. తద్వారా రాష్ట్రంలో అంతర్జాతీయ డేటా కనెక్టివిటీని మెరుగుపరచడం కోసం ఐఐటీఎంతో ఐటీ శాఖ మరో ఒప్పందం కుదుర్చుకుంది.

## ఆర్టీజీఎస్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ రంగాల్లో సాఫ్ట్‌వేర్ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి ఐఐటీఎం, ఆర్టీజీఎస్ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందుకోసం ఐఐటీఎం ప్రవర్తక్‌తో ఏపీ ఆర్టీజీఎస్ కలసి పనిచేస్తుంది.

## స్పోర్ట్స్ సిటీ కోసం క్రీడల శాఖ

రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో స్మార్ట్ టెక్ ఎనేబుల్డ్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఐఐటీఎం ద్వారా సాంకేతిక సలహాలు పొందేందుకు ఈ క్రీడల శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ఈ ఒప్పందం ఉపకరిస్తుంది.

# కార్తీక పౌర్ణమి వేడుకల్లో మంత్రి లోకేష్



- మంగళగిరిలో కోటి దీపోత్సవంలో జ్యోతి ప్రజ్వలన
- కాలినడకన వెళ్లి గండాలయ నరసింహస్వామి దర్శనం
- మొక్కులు తీర్చుకుని గండ దీపం వెలిగించిన మంత్రి లోకేష్



మంగళగిరి (చైతన్యరథం): కార్తీక పౌర్ణమి వేడుకల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందడి చేశారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మంగళగిరిలో దిగువన ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్తర గాలి గోపురం వద్ద ఓంశ్రీ మణిదీపం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన కోటి దీపోత్సవంలో పాల్గొని అఖండ కోటి దీపం వెలిగించారు. ముందుగా కోటిదీపోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి పండితులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి నారా లోకేష్ పానకాల లక్ష్మీనరసింహ ఆలయానికి చేరుకుని అక్కడి నుంచి మెట్లమార్గంలో కాలినడకన వెళ్లి కొండ శిఖరాగ్రాన కొలువై ఉన్న గండాలయ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని గండ దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. గండాలయ స్వామి కొండకు మంత్రి లోకేష్ రాకను పురస్కరించుకుని పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.









చైతన్యరథం

# కేంద్ర మంత్రులతో సానుకూలంగా సీఎం చంద్రబాబు చర్చలు

## - టీడీపీపీ నేత లావు వెల్లడి


రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీలతో ఢిల్లీలో సమావేశమైన సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన విజయవంతమైందని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. కేంద్ర మంత్రులతో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం సీఎం చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఢిల్లీలో ఆయనకు టీడీపీ ఎంపీలు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలు చర్చించారు.

అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు ఈ అంశాలను వివరించారు. వ్యవసాయంపై ఆధారపడిన ఏపీలో గోదావరి - పెన్నా అనుసంధాన ప్రాజెక్ట్ ముఖ్యమైనదన్నారు. ఈ ప్రాజెక్టుకు సహాయ సహకారాలు అందించాలని కేంద్రాన్ని కోరామన్నారు. నదుల అనుసంధానానికి అవసరమైన నిధులను విడుదల చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. నదుల అనుసంధానంతో వ్యవసాయాధారిత ఆంధ్రప్రదేశ్‌లోని క్షామ పీడిత ప్రకాశం, రాయలసీమ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించడం సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కి సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారని చెప్పారు.

అమెరికాలో కొత్త ప్రభుత్వం ఏర్పడినందున భారత్ నుంచి అమెరికా వెళ్లే విద్యార్థుల పరిస్థితి, ఆర్థిక రంగంలో జరిగే మార్పులపై కేంద్ర మంత్రి జై శంకర్‌తో చంద్రబాబు చర్చించారు. విద్యార్థులు, ప్రజలు ఎదుర్కొనే ఇమ్మిగ్రేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని, పెట్టుబడుల కోసం విదేశీ కంపెనీలను ఏపీకి ఆహ్వానించాలని కోరాం. విదేశీ సంస్థలను ఏపీకి పంపడంలో సహకరిస్తామని కేంద్ర మంత్రి జై శంకర్ హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణంలో గతంలో సింగపూర్ భాగస్వామ్యమైంది. సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాలని సీఎం కోరారు. అన్ని అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ కృష్ణదేవరాయులు తెలిపారు.

## అమరావతిలో భూములు కేటాయించిన

# సంస్థలతో సంప్రదింపులు

### - మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం



అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వం ఆడిన మూడుముక్కలాటతో అమరావతిలో భూములు పొందిన సంస్థలు నిర్మాణాలు ప్రారంభించేందుకు ముందుకు రాలేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో భూములు కేటాయించిన వివిధ సంస్థలతో ఈ విషయమై మరోసారి సంప్రదింపులు జరపాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రాజధానిలో భూకేటాయింపులకు సంబంధించి ఆరుగురు మంత్రులు, అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ ఉపసంఘం మొదటి సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, టీజీ భరత్ తో పాటు సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి కన్నబాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి జే నివాస్, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు.

సమావేశం అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో 2014-19 మధ్య కాలంలో సుమారు 130 సంస్థలకు సీఆర్డీఏ భూకేటాయింపులు చేసిందన్నారు. ఏయే సంస్థలకు ఎక్కడెక్కడ ఎంతెంత భూకేటాయింపులు చేసారనే దానిపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించినట్లు తెలిపారు. గతంలో భూములు కేటాయించిన సంస్థలతో చర్చించాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించామన్నారు. గత ప్రభుత్వ మూడుముక్కలాటతో భూములు పొందిన సంస్థలు నిర్మాణానికి ముందుకు రాలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి ఆయా సంస్థలకు నమ్మకం వచ్చిందన్నారు. అమరావతికి వచ్చి నిర్మాణాలు ప్రారంభించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయన్నారు. అలాంటి వాటి విషయంలో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామన్నారు. మరోవైపు అమరావతిలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల రద్దుపై సాంకేతిక కమిటీ ఇచ్చిన నివేదికను ఈనెల 18న జరిగే కేబినెట్ లో పెట్టి ఆమోదం తీసుకుంటామన్నారు. కేబినెట్ ఆమోదం తర్వాత కొత్త టెండర్లు పిలుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేసారు.

మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అమరావతిలో ప్రాజెక్ట్‌లు వేగవంతం చేయాలని నిర్ణయించామన్నారు. గతంలో భూములు కేటాయించిన సంస్థలు త్వరగా నిర్మాణాలు ప్రారంభించేలా వారితో సంప్రదింపులు జరుపుతామన్నారు. భూములు కేటాయించిన సంస్థలకు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాం. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రతి పది రోజులకోసారి కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.

## నేడు, రేపు మహారాష్ట్రలో

## ఎన్డీఏ తరఫున సీఎం చంద్రబాబు ప్రచారం

అమరావతి (చైతన్యరథం): ఈ నెల 20న ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో ఎన్డీఏ అభ్యర్థుల తరఫున శని, ఆదివారాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారం చేయనున్నారు.

శుక్రవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. అనంతరం రాష్ట్ర ఎంపీలతో సమావేశమయ్యారు. రాత్రికి ఢిల్లీలోనే బస చేసి, శనివారం మధ్యాహ్నం 12.20 గంటలకు తాజ్ ప్యాలెస్ హోటల్‌లో ప్రముఖ మీడియా సంస్థ నిర్వహిస్తున్న సదస్సుకు హాజరవుతారు. అనంతరం విమానంలో ముంబయి చేరుకుంటారు. శనివారం రాత్రి వరకు థానే, భివాండి ప్రాంతాల్లో ప్రచార సభల్లో పాల్గొని ముంబయిలోనే బస చేస్తారు. ఆదివారం ముంబయిలోని సియోన్ కోలివాడ, వర్లి ప్రాంతాల్లో ప్రచార సభల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.10 గంటలకు ముంబయిలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొంటారు.

# రెండేళ్లలో 50 లక్షలకు ఫైబర్‌నెట్ కనెక్షన్లు

- ◆ పెంచుతామని ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ చైర్మన్ జీవీ రెడ్డి ఉద్ఘాటన
- ◆ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం



అమరావతి (చైతన్యరథం): ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) చైర్మన్‌గా జీవీ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఫైబర్‌నెట్ కనెక్షన్లను రెండేళ్ల కాలంలో యాభై లక్షలకు పెంచుతామన్నారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. 2014లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీ ఫైబర్ నెట్‌ను ప్రారంభించారన్నారు. ఇది సర్వీస్ ప్రొవైడర్ కేబుల్ నెట్‌వర్క్ అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రిక ఏపీఎస్ఎఫ్ఎల్ అన్నారు. ఇప్పటి వరకు ఆరు లక్షల కేబుల్ కనెక్షన్లు మాత్రమే ఉన్నాయన్నారు. వీలైనంత వరకు నాణ్యమైన సేవలు అందించి ఇచ్చి ప్రజల ఆదరణ పొందుతామన్నారు. ప్రైవేట్ కంపెనీ సర్వీస్ ప్రొవైడర్లకు పోటీగా ప్రజలకు సేవలు అందిస్తామన్నారు.

గత ప్రభుత్వంలో ఏం జరిగింది, ఏం చేశారనే అంశాలపై త్వరలోనే ఆధారాలతో మాట్లాడతానన్నారు. ఫైబర్ నెట్‌ను ప్రజలకు చేరువ చేయడంలో తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇంటర్ నెట్, ఫోన్, కేబుల్ పూర్తి క్వాలిటీతో అందిస్తామన్నారు. నేడు వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది సహజంగా మారి పోయిన తరుణంలో నెట్ కనెక్షన్ అందరికీ అవశ్యకమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఈ సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో ప్రారంభ సమయంలో బాగా కనెక్షన్లు తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల చాలా మంది ప్రైవేటు సంస్థలకు మళ్లారన్నారు. మళ్లీ పూర్తి క్వాలిటీతో ప్రసారాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. యాభై లక్షల కనెక్షన్ల లక్ష్యాన్ని రెండేళ్లలో సాధిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై అధ్యయనం చేసిన తరువాత స్పందిస్తానన్నారు. ప్రజలకు నాణ్యమైన ప్రసారాలు అందచడం పైనే ప్రస్తుతం మా ఆలోచనలు, ప్రణాళికలు ఉన్నాయన్నారు. చైర్మన్ ను అభినందించిన వారిలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గాలి భానుప్రకాష్, బీఎన్ విజయ్‌కుమార్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కందుల నారాయణరెడ్డి, కొండ్రు మురళీ మోహన్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం, తదితరులు ఉన్నారు.

# జగన్ అరాచక పాలనతో ఆర్థిక అధోగతి

- దారికి తెచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నాం
- చంద్రబాబు చొరవతోనే గట్టెక్కాలి
- అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ పాలన పాపాల పుట్టగా సాగిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు శుక్రవారం అసెంబ్లీలో మంత్రి కేశవ్ సమాధానం ఇస్తూ జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అరాచకాలను ఎండగట్టారు. బడ్జెట్ పెట్టలేదు పెట్టలేదని పదేపదే వైసీపీ నేతలు అన్నారు. అసలు బడ్జెట్ పెట్టడానికి వీలు లేని విధంగా ఆర్థిక పరిస్థితిని మీరు దిగజార్చారు. జగన్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానాలు రాష్ట్ర అభివృద్ధికి ప్రతికూలంగా పనిచేశాయి. చంద్రబాబు నాయుడు అధికారంలో దిగిపోయిన రోజు అప్పులు రూ. 3 లక్షల 75 వేల కోట్లు. జగన్ ప్రభుత్వం దిగిపోయినప్పుడు ఉన్న అప్పులు రూ. 9లక్షల 70 వేల కోట్లు. అంటే దాదాపు రూ.10 లక్షల కోట్లు. అప్పులు వివిధ పద్దుల కింద ఉంటాయి. తెచ్చిన ప్రతి రూపాయిలో 60శాతం మూలధన వ్యయంగా టీడీపీ హయాంలో ఖర్చు చేశాం. జగన్ తెచ్చిన అప్పుల్లో 22 శాతం మాత్రమే మూలధన వ్యయానికి ఖర్చు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం రూ. 1600 కోట్లతో పట్టిసీమ కడితే ఐదేళ్లలో రూ. 44 వేలకోట్ల మేర పంట ఉత్పత్తులు తెచ్చిపెట్టింది. వైసీపీ ప్రభుత్వానికి వ్యక్తిగత సంపదను పెంచడం మాత్రమే తెలుసు. రాష్ట్ర సంపదను పెంచడం వారికి చేతకాదని మంత్రి పయ్యావుల అన్నారు.

ఆర్థిక ఉగ్రవాది జగన్ ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు నిర్విరామంగా శ్రమిస్తున్నారన్నారు. కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వీలు లేకుండా చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను ఎలా పిలవాలో అర్థం కావట్లేదు. ఐదేళ్లలో ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే జరిగింది. దేనికీ సరైన లెక్కలు, జమా ఖర్చులు లేవు. గత ప్రభుత్వం అంకెల గారడీతో అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలను తప్పుదారి పట్టించింది. ఇప్పుడు కూడా అంకెల గారడీ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.



### పెండింగ్‌లో బిల్లులు

కాంట్రాక్టర్ల బిల్లులను పెండింగ్ లో పెట్టారు. గత ప్రభుత్వ వైఖరితో అనేక మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. పిల్లలకు ఇచ్చే చిక్కీల బిల్లులు కూడా పెండింగ్లో పెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. మేం వచ్చాక సర్టిఫికెట్లు ఇప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా పక్కన పెట్టింది. పోలవరం పనులు నిలిపివేసి డయాఫ్రమ్ వాల్ విధ్వంసానికి కారణమయ్యారు. రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు. సూట్‌కేస్ కంపెనీలు.. బ్రీఫ్ కేస్ కంపెనీలు.. క్విడ్ ప్రో కో పదాలు పరిచయం చేశారు. గత పాలకులు చేసిన ఇసుక, మద్యం మాఫియా అందరికీ తెలుసు.

### చట్టసభల అనుమతి లేకుండానే..

చట్టసభల అనుమతి లేకుండా రూ.634 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ చెప్పింది. అనుమతి లేని ఖర్చులు ఎవరి కోసం చేశారు? ఎందుకు చేశారు? వైకాపా హయాంలో పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకు పారిపోయారు. చంద్రబాబు వచ్చాక మళ్లీ అనేక మంది వస్తున్నారు. అమరావతి విధ్వంసం.. విశాఖ భూ దోపిడీ మీ అరాచకం కాదా? సంక్షేమం.. అభివృద్ధి.. బ్యాలెన్స్ చేసుకుంటూ బడ్జెట్ ప్రవేశపెట్టాం. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 90 మంది పారిశ్రామికవేత్తలను కలిశారని మంత్రి పయ్యావుల తెలిపారు.

### కేంద్ర పథకాలకు జగన్ ఎగనామం

కేంద్రం ఇచ్చిన 93 పథకాలకు జగన్ ప్రభుత్వం ఎగనామం పెట్టిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 100శాతం గ్రాంట్ ఇచ్చే పథకాన్ని కూడా జగన్ ప్రభుత్వం ఆపేసిందన్నారు. ఇప్పుడు ఒక్కో పథకం పునరుద్ధరించడానికి నానా అగచాట్లు పడాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. గతంలో అప్పుల కోసం చేయని తప్పు లేదన్నారు. పొరుగు రాష్ట్రాలు 8శాతం వడ్డీకి తెస్తే వీరు 10.50 శాతానికి చేశారన్నారు.

# పాపకు ప్రాణం పోసిన పల్లా



- ఆర్థిక సాయం చేసి ఆదుకున్న దాతృత్వం
- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు
- ఎమ్మెల్యే శిరీష అభినందనలు

అమరావతి (చైతన్యరథం) : శ్రీకాకుళం జిల్లా, పలాస నియోజకవర్గం, సుమాదేవి అనే గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి విలిక అలవి కాని వ్యాధితో బాధపడుతోంది.

పాప ప్రాణం నిలబడాలంటే ఫైబ్రోనియేజన్ ఇంజక్షన్ నెలలో రెండు సార్లు వేయాల్సి ఉంది. ఒక్కొక్క ఇంజక్షన్ ఖరీదు రూ.32వేలు అవుతోందని వైద్యులు తెలిపారు. నిరుపేద తల్లిదండ్రులకు అది తలకు మించిన భారమే. అందుకే ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఆశగా పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరిష ద్వారా ప్రభుత్వాన్ని ఆర్థికసాయం కోరారు.

ఈ సమాచారంతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ వెంటను స్పందించారు.

రూ. 32,000 ఆర్థిక సహాయమందించి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రభుత్వం నుంచి సాయం వచ్చే వరకు తన సొంత నిధులతో పాపకు ఇంజక్షన్లకు అయ్యే ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు, ఆపదలో ఆదుకోవడానికి నేనున్నానని సాయం చేస్తున్న పల్లాకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు కూడా అభినందనలు తెలిపారు.

# సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యం

**- మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పూర్తిగా ధ్వంసమైన రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులు, ఇతర రహదారులకు సంబంధించి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా మరమ్మతు పనులను వేగవంతం చేసేందుకు 3 జీవోలను సైతం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. అదే సమయంలో వేగంగా రోడ్ల మరమ్మతులను పూర్తి చేయడానికి 7 రోజుల వ్యవధిలో షార్ట్ టర్మ్ టెండర్లు కూడా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రోడ్లను గుంతల రహిత రహదారులుగా మార్చడానికి, అదే విధంగా రాష్ట్ర హైవేలు, జిల్లా ప్రధాన రహదారుల వెంబడి పెరిగిన ముళ్ల కంపలను తొలగించడానికి మొత్తంగా రూ. 210 కోట్లు ఇప్పటికే కేటాయించామన్నారు. దీనికి సంబంధించి



ఇప్పటికే 1839 పనులకు గానూ రూ.198.84 కోట్లు కేటాయించగా, మిగిలిన రూ.11.16 కోట్లకు సంబంధించిన పనులు మరో దశలో చేపడాతమన్నారు. రూ. 198.84 కోట్లలో రాష్ట్ర హైవే పనులకు సంబంధించి రూ. 50.46 కోట్లు, జిల్లా ప్రధాన రహదారులకు సంబంధించి రూ.148.38 కోట్లు కేటాయించామన్నారు. మొత్తం 1839 పనుల్లో 687 మైనర్ మరమ్మతులు, 473 తీవ్రమైన గుంతలు, 679 ముళ్ల కంపలకు సంబంధించిన పనులు ఉన్నాయన్నారు. అలాగే జిల్లా ప్రధాన రహదారులు, రాష్ట్ర హైవేలకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద రూ.140 కోట్లు కేటాయించామన్నారు. ఇందులో జిల్లా ప్రధాన రహదారులకు సంబంధించి 1766 కి.మీ మేర 350 పనుల కోసం రూ.92.75 కోట్లు, రాష్ట్ర హైవేలకు సంబంధించి 796 కి.మీ మేర 128 పనుల కోసం రూ. 47.25 కోట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు, వరదల వల్ల తీవ్రంగా ధ్వంసమైన రాష్ట్ర హైవేల్లో సీడీ వర్క్‌లు, జిల్లా ప్రధాన రహదారులను శాశ్వత ప్రాతిపదికన పునర్‌నిర్మించడానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల నుండి రూ. 220.41 కోట్లు కేటాయించామన్నారు. ఇందులో రాష్ట్ర హైవేలకు సంబంధించి రూ.102.30 కోట్లతో 75 పనులను, జిల్లా ప్రధాన రోడ్లకు సంబంధించి 118.10 కోట్లతో 145 పనులను చేపట్టనున్నట్లు తెలిపారు..

# సాక్షి మీడియాలో 'తప్పుడు ప్రచారం'

- చర్యలు తీసుకోవాలని మండలి ఛైర్మన్‌కు మంత్రుల విజ్ఞప్తి
- సాక్షి టీవీ, పేపర్లో దుష్ప్రచారంపై మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి ఆగ్రహం

అమరావతి (చైతన్యరథం): శాసనమండలిలో జరిగే వ్యవహారాలను వక్రీకరిస్తూ సాక్షి పేపర్, టీవీల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని శాసన మండలి ఛైర్మన్‌ను మంత్రులు కోరారు. సాక్షి టీవీ, పేపర్లో జరుగుతున్న దుష్ప్రచారంపై మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రులు స్పష్టంగా సమాధానం ఇచ్చినా నీళ్లు నమిలారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, లేనివి ఉన్నట్లుగా కల్పించి సాక్షి పేపర్, టీవీ ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తోందని అచ్చెన్నాయుడు సభ దృష్టికి తెచ్చారు. తమకు పేపర్, టీవీ ఉందని వైఎస్సార్సీపీ వారు అన్నీ అబద్ధాలే చెప్పిస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శాసన వ్యవస్థకు పోటీగా మరో వ్యవస్థను సృష్టించేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని మంత్రి పార్థసారథి అన్నారు. అసెంబ్లీ, శాసనమండలి ప్రశ్నోత్తరాలపై జగన్ కుటుంబానికి చెందిన సాక్షి పత్రిక సమాంతర వ్యవస్థను నడుపుతోందని మంత్రి పార్థసారథి ఆరోపించారు. సభ్యులు శాసనసభకు రాకుండానే ఇష్టమొచ్చినట్లు తప్పుడు ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. శాసన వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా సాక్షి వైఎస్సార్సీపీ సభ్యులు వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీ సభ్యులకు దమ్ముంటే శాసన సభకు వచ్చి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సవాల్ చేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ తరహా విధానానికి చెక్‌పెట్టాలని డిమాండ్ చేశారు.

చైతన్యరథం

# నేటి నుంచి ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభం

- 26 జిల్లా కేంద్రాల్లోనూ డీఎస్సీ కోచింగ్ సెంటర్లు
- 2 నెలల పాటు శిక్షణ
- నెలకు రూ.1500ల చొప్పున స్టయిఫండ్
- పుస్తకాల కోసం మరో రూ.1000 అందజేత
- త్వరలో ఆన్‌లైన్‌లోనూ కోచింగ్
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టీకరణ



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల డీఎస్సీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వనుంది. దీనిలో నేటి నుంచి(శనివారం) రాష్ట్ర వ్యాప్తంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించనుంది. రాష్ట్రంలో ఉన్న 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి సంతకంగా సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ నిర్వహణపై సంతకం చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలని నిర్ణయించారన్నారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ల ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కేంద్రాల ద్వారా డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతకు ఆర్థిక దన్ను కలిగిస్తూ, సబ్జెక్టుల వారీగా నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణివ్వాలని నిర్ణయించామన్నారు. నేటి నుంచి (శనివారం) రాష్ట్ర వ్యాప్తంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. గుంటూరులో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ను ముఖ్య అతిథుల సమక్షంలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

### శిక్షణా సమయంలో స్టయిఫండ్

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని మంతరి సవిత వెల్లడించారు. ఈ కోచింగ్ సెంటర్లలో బీసీలలో ఇతర సామాజిక వర్గాలకుచెందని అభ్యర్థులకు కూడా ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం చొప్పున సీట్లు కేటాయించామన్నారు. వారితో పాటు ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు మరో 10 శాతం సీట్లు కేటాయించామన్నారు. 2 నెలల పాటు సాగనున్న ఈ ఉచిత డీఎస్సీ కోచింగ్ సమయంలో అభ్యర్థులకు నెలకు 1500 రూపాయి చొప్పున స్టయి ఫండ్ అందజేయనున్నామన్నారు. మెటీరియల్ కోసం మరో రూ.1000లు ఇవ్వనున్నామన్నారు.

### త్వరలో ఆన్‌లైన్లోనూ కోచింగ్

ఆఫ్ లైన్‌తో పాటు ఆన్ లైన్ లోనూ డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని మంత్రి సవిత తెలిపారు. ఆఫ్ లైన్ లో అవకాశం లభించని వారితో పాటు ఆసక్తి చూపిన వారందరికీ ఆన్ లైన్ లోనూ ఉచిత శిక్షణివ్వనున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ సైట్ రూపొందిస్తున్నామన్నారు. ఈ వెబ్ సైట్ లో సబ్జెక్టుల వారీగా నిపుణులైన వారితో క్లాసుల నిర్వహిస్తున్నామన్నారు. క్లాసులతో పాటు పాత క్వశ్చన్ పేపర్లు, మోడల్ పేపర్లు కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. బీఈడీ అర్హతతో పాటు టెట్ లో ఉత్తీర్ణత సాధించిన వారికే ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోచింగ్ ఇవ్వనున్నామని మంత్రి తెలిపారు. ఆన్ లైన్ అభ్యర్థులకు తమ కిష్టమైన సమయాల్లో క్లాసులు వినే అవకాశం కలిగేలా వెబ్ సైట్ ను రూపొందిస్తున్నా మన్నారు. ఆన్ లైన్ కోచింగ్ తో గృహిణులకు, ప్రైవేటు, ప్రభుత్వ రంగంలో పనిచేసే పార్ట్ టైమ్ ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఆఫ్ లైన్...ఆన్ లైన్...ఏదో ఒకే విధానంలో మాత్రమే అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అవకాశం ఇవ్వనున్నట్లు ఆ ప్రకటనలో మంత్రి సవిత వెల్లడించారు.

# సమర్థవంతంగా దీపం-2 పథకం అమలు

- అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు
- అసెంబ్లీలో ఆహారం, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టీకరణ
- కావాలనే ప్రతిపక్షాలు దీపం-2 పథకంపై ప్రజల్లో అనుమానాలు కలిగే విధంగా అసత్యప్రచారం



అమరావతి (చైతన్యరథం) : సమర్థవంతంగా దీపం -2 పథకం అమలు చేస్తున్నామని ఆహారం, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అసెంబ్లీలో వెల్లడించారు. శుక్రవారం శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, ఎస్.మంగమ్మలు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. "ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు దీపావళి కానుకగా దీపం-2- పథకం 31 అక్టోబర్ 2024న ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడు ఈదుపురం గ్రామం, ఇచ్ఛాపురం మండలం శ్రీకాకుళం జిల్లాలో దీపం పథకాన్ని ప్రారంభించారు. ఏపీలో సూపర్ సిక్స్ హామీ నిలబెట్టుకుంటున్న కూటమి సర్కార్. రాష్ట్రంలో ఒక కోటి 55 లక్షల 22 వేల గ్యాస్ కలెక్షన్ ఉన్నాయి. ఇందులో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వద్ద ఉన్న గ్యాస్ కనెక్షన్ల డేటాతో... రైస్ కార్డుల డేటాబేస్ తో అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగింది.. దీని ద్వారా రాష్ట్రంలో ఉన్న ఒక కోటి 55 లక్షల మంది గ్యాస్ కార్డుదారులకు అర్హత ఉండేవిధంగా ఈ పథకం రూపొందించడం జరిగింది. దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం... మొదటి విడతకు అయ్యే ఖర్చు రూ.894 కోట్ల మొత్తాన్ని పెట్రోలియం సంస్థలకు అందజేయడం జరిగింది. గత 15 రోజుల్లో దీపం - 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిల్లిండర్లను 35 77 566 మంది బుకింగ్ చేసుకున్నారు... అందులో 2564951 మందికి ఉచిత గ్యాస్ డెలివరీ చేయడం జరిగింది....ఇందుకు గాను 141 కోట్ల 17 లక్షల 81 వేల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగింది.... కావాలనే ప్రతిపక్షాలు దీపం 2 పథకంపై ప్రజల్లో అనుమానాలు కలిగే విధంగా ప్రచారం చేస్తున్నారు. దీపం-2 పథకం క్రింద అర్హులైన కుటుంబాలు వారు తమ మొదటి సిలిండర్ పొందడం కోసం అక్టోబర్ 29వ తేదీ నుంచి 31 మార్చి 2025 వరకూ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ ఇస్తారు.ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో తిరిగి జమ చేస్తారు. ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఈ దీపావళితో ప్రారంభమయిన పథకంతో పాటు ప్రతి ఏడాది ఏప్రిల్ - జూలై (01), ఆగష్టు - నవంబర్ (01), డిసెంబర్ - మార్చి (01) మధ్య మూడో సిలెండర్ బుక్ చేసుకోవచ్చు". అని వెల్లడించారు.



# ప్రతి రైతుకు అండగా ఉంటాం

- కొనుగోళ్లలో ఇబ్బందులు పరిష్కరించాలి
- కంప్లైంట్ బాక్స్, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయండి
- సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పెమ్మసాని ఆకస్మిక తనిఖీలు

గుంటూరు (చైతన్యరథం): ' ప్రత్తి కొనుగోళ్ళు పారదర్శకంగా జరగాలి. ప్రత్తిలోని తేమ పరీక్షలలో తేడాలు రావడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారు. సీసీఐ కొనుగోలు చేయాల్సిన ప్రత్తి దళారుల పాలు కాకూడదు. రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత మన అందరి పైన ఉంది.' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కుర్నూతల గ్రామంలో గల సీ.సీ.ఐ ఆధ్వర్యంలో గాయత్రి జిన్నింగ్ మిల్లులో ప్రత్తి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పెమ్మసాని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో ముందుగా రైతులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు సమయంలో మాయిశ్చరైజ్ టెస్టులలో సమస్యలు ఉన్నాయని రైతులు తెలియజేశారు. కాగా అధికారులతో దగ్గరుండి మాయిశ్చరైజ్ పరీక్షలను పెమ్మసాని చేయించారు. పరీక్షలలో తేమ శాతంలో మార్పు ఉండడాన్ని గమనించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ 'వాతావరణం అనుకూలంగా లేని సమయంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లలో వేగం పెంచాలి.' అని సూచించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కంప్లైంట్ బాక్స్, టోల్ ఫ్రీ నెంబర్లను వెంటనే ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజగారికి ఆదేశించారు. అలాగే విత్తనాలు, ఫెర్టిలైజర్లు కల్తీ చేస్తున్న వారిని కూడా ఆయన హెచ్చరించారు. రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని, వెంటనే పద్ధతి మార్చుకోవాలని చెప్పారు. త్వరలో తాను నకిలీ ఫెర్టిలైజర్స్, ఎరువులపైనా దృష్టి సారించబోతున్నానని ఈ సందర్భంగా పెమ్మసాని తెలియజేశారు.

# గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వండి

- పుట్టపర్తి నియోజకవర్గంలో ఎస్టీ సబ్ ప్లాన్ కింద రోడ్డు సౌకర్యం కల్పించండి
- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వినతి



పుట్టపర్తి (చైతన్యరథం): సత్య సాయి జిల్లాలో చాలా మంది నిరుపేద గిరిజనులు 50 సంవత్సరాలుగా అటవీ ప్రాంత భూములను సాగు చేసుకుంటూ జీవనం పొందుతున్నారని అలాంటి గిరిజన రైతులకు సాగు పట్టాలు మంజూరు చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని ఏళ్ళుగా సాగు పట్టాలు లేక గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ గిరిజన రైతుల సమస్యలపై శుక్రవారం శాసనసభలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సభ ద్వారా ప్రభుత్వానికి విన్నవించి వారికి ఈ ప్రభుత్వం న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. గిరిజనుల హక్కు చట్ట ప్రకారం వారికి సాగు పట్టాలు ఇచ్చే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అని పల్లె సింధూర సంబంధిత మంత్రిని అడిగారు. వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు ట్రాక్టర్లు గొర్రెలు ,మేకలు , ఆవులు,సరుకుల అంగళ్ళు వంటివి గిరిజనులకు ఇవ్వకుండా రద్దు చేశారు గిరిజన కార్పొరేషన్ను ఆ ప్రభుత్వంలో పూర్తిగా నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే పల్లె సింధూర సభ ద్వారా పేర్కొన్నారు

### గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండలం రాగానిపల్లి తండాకు కొన్ని ఏళ్లుగా రోడ్డు సౌకర్యం, నల్లమాడ మండలం రెడ్డిపల్లి నుంచి పాముదుర్తి కొత్తకోట తండా వరకు, ఓడి చెరువు మండలం చెరువు మునేప్పగారి పల్లి నుంచి నాయనా కోట తాండా వరకు గిరిజన గ్రామాలకు వెళ్ళే రోడ్లు సక్రమంగా లేక గిరిజన ప్రాంతాల ప్రజలు విద్యార్థులు మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సభలో ప్రభుత్వానికి వెల్లడించారు. ఈ ప్రాంతాల విద్యార్థులను మహిళలను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

# నైతికతే నూతన విద్యా వ్యవస్థకు మూలస్తంభం

**◆ఎంపీ శ్రీ భరత్ స్పష్టీకరణ**



విశాఖపట్నం (చైతన్యరథం): శుక్రవారం హోటల్ మారియట్ లో జరిగిన విద్యా వ్యవస్థ పై జరిగిన సదస్సులో ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. "నూతన విద్యా వ్యవస్థ" అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యమైన అంశాలను ప్రస్తావించారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, లింక్‌డిన్ ఇండియా పబ్లిక్ సెక్టార్ హెడ్ సబా కరీమ్, కాలారెక్స్ గ్రూప్ సీఈఓ మంజుల పూజ శ్రాఫ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. "విద్య అనేది కేవలం విజయం కోసం కాదుటీ అది నైతికతను అలవర్చే మార్గం కావాలి," అని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. సమాజంలో 'ఏదైనా సాధించడం' అనే ధోరణి పెరుగుతుండడంతో, పాఠశాలలు మరియు తల్లిదండ్రులు పిల్లలలో నైతికతను పెంపొందించడంలో కీలక పాత్ర వహించాలన్నారు.

### సాంకేతికత - సమతౌల్యం అవసరం

సాంకేతికతపై మాట్లాడుతూ..."సాంకేతికత ఒక శక్తివంతమైన సాధనం, కానీ అది డిజిటల్ వైషమ్యాన్ని పెంచకుండా అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి," అన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ?29,000 కోట్ల నిధులు కేటాయించబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ నిధులను ఉపాధి మరియు సాంకేతిక వనరుల సమకూర్పులో ఉపయోగించాలని సూచించారు.

### జెన్‌లో - సరికొత్త సవాళ్లు

జెన్ - యువత పనిలోకి వస్తున్న నేపథ్యంలో, వారి కోసం విద్యా వ్యవస్థలు కొత్త విధానాలను అనుసరించాలని శ్రీభరత్ పిలుపునిచ్చారు. "పరిశ్రమలు ఇప్పుడు అనువైన నైపుణ్యాలు మరియు వేగంగా నేర్చుకునే సామర్థ్యాలను కోరుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యా విధానాలను రూపొందించాలి," అని వివరించారు.

### సామాజిక మాధ్యమాలపై నియంత్రణ

ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించిన విషయంపై చర్చిస్తూ, "సమాజిక మాధ్యమాల ప్రభావం పిల్లల ఆత్మవిశ్వాసం మరియు మానసిక ఆరోగ్యంపై గణనీయంగా ఉంటుంది. దీనిపై తల్లిదండ్రులు మరియు పాఠశాలలు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి," అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.



# అలిగి ఇంట్లో కూర్చుంటానంటే కుదరదు

**◆జగన్ అసెంబ్లీకి రావాల్సిందే**

**◆సభకు రాకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సోమిరెడ్డి డిమాండ్**

జగన్ అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చొంటాను అంటే కుదరదని సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ప్రజలు ఎన్నుకున్న 11 మంది అసెంబ్లీకి రాకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక విద్యార్థి పరీక్షలకు గైర్హాజరైతే అయన్ను పాస్ చేస్తారా? అని ప్రశ్నించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద శాసనాలు చేయాలని ఆయా నియోజకవర్గాల ప్రజలు పంపించారని తెలిపారు. అంతేగాని ప్రతిపక్ష హెూదా ఇవ్వలేదని అసెంబ్లీకి రాకుండా ప్రజాప్రతినిధులు ఇంట్లో అలిగి కూర్చుంటారా? అని మండిపడ్డారు. బడ్జెట్ చర్చలో భాగంగా శాసనసభలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు ఇంట్లో జరిగినవి కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా ధనం ఖర్చు చేసి ఎన్నికలు నిర్వహించి చట్ట సభకు పంపించిందని గుర్తుచేశారు. అసెంబ్లీ అంటే గౌరవం లేకుండా రానంటే చట్టప్రకారం తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ చెప్పుకొచ్చిన జగన్ వారిని నిండా ముంచారని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. వారికి కట్టిన ఇళ్లు అన్నీ పెచ్చులు ఊడుతున్నాయని ఆక్షేపించారు. జగన్ ప్రభుత్వ హయాంలో దారుణమైన దోపిడీ జరిగిందని అన్నారు. రీ సర్వే గురించి ఎవరు అడిగారని, తాత ముత్తాతలు ఇచ్చిన ఆస్తులపై ఆయన బొమ్మ వేసుకోవడం ఏమిటని సోమిరెడ్డి మండిపడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ దుర్మార్గమని సోమిరెడ్డి అన్నారు. దీనిపై విజిలెన్సు విచారణ జరుగుతోందని తెలిపారు. జగన్ హయాంలో ఐఏఎస్ అధికారులకే దిక్కులేదని ఇక విశ్రాంత అధికారులకు ఏం అధికారం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ అనుకూలంగా ఉందని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

# వైసీపీ పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**◆కిందిస్థాయి సిబ్బందిని బలిపశువులను చేయడం సరికాదు**

**◆వైసీపీ నేతల కనుసనల్లో పనిచేస్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ, డీఎస్పీపై మండిపడ్డ రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ**




అమరావతి (చైతన్యరథం) : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా కూడా పోలీస్ శాఖలో ఇంకా మార్పు కనపడిన దాఖలాలు లేవని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ వ్యాఖ్యానించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు, భువనేశ్వరి, లోకేష్ పుట్టుక గురించి, పవన్ కళ్యాణ్ గురించి అసహ్యంగా మాట్లాడుతూ... తీవ్రంగా బూతులు తిడుతూ బెదిరిస్తూ మాట్లాడిన రౌడీ షీటర్, వైసీపీ నేత బోరుగడ్డ అనిల్ కు పోలీసులు చేసిన రాచమర్యాదల అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన సీసీటీవీ ఫుటేజ్ విషయంలో ప్రైవేటు టెక్నీషియన్ బ్రాహ్మణ యువకుడు భ్రుగుబండ శేషును వారం క్రితం అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమన్నారు. పోలీసుల చర్యలను తాము ఖండించిన వెంటనే తప్పుడు కేసులు బనాయించి రిమాండ్ కి పంపడం జరిగిందని, ఆ యువకుడికి కనీసం వైద్య పరీక్షలు కూడా చేయించకుండా కోర్టులో ప్రవేశపెట్టారని, తమపై కోర్టులో చెబితే ఎన్ కౌంటర్ చేస్తామని బెదిరించారని, సీసీ ఫుటేజ్ ప్రమేయంలో ఉన్న పోలీస్ సిబ్బందిపై ఇంతవరకు కేసు నమోదు చేయలేదని, కానీ ఇద్దరు మీడియా జర్నలిస్టులపై కేసు నమోదు చేసి వారికి మొక్కుబడిగా 41 నోటీసు ఇచ్చి వదిలి వేయడం దుర్మార్గమన్నారు. అరెస్టుల అంశంలో కూడా వివక్ష చూపిస్తున్నారని, రాజ మర్యాదలు అంశంలో తప్పు చేయించిన ఉన్నతస్థాయి అధికారులైన గుంటూరు జిల్లా ఎస్పీ, గుంటూరు వెస్ట్ డీఎస్పీ తదితర అధికారులపై ఎందుకు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని శ్రీధర్ ప్రశ్నించారు. రాచ మర్యాదలు సంఘటన జరిగిన స్థానిక అరండల్ పేట స్టేషన్లో పనిచేసే నలుగురు క్రింది స్థాయి సిబ్బందిపై, సీఐని వీఆర్కి పంపి చర్యలు తీసుకొని చేతులు దులిపేసుకుంటారా అని శ్రీధర్ ప్రశ్నించారు. స్టేషన్లో కింద స్థాయి సిబ్బంది పై స్థాయి అధికారులు చెప్పకుండానే రౌడీషీటర్ కు రాజ మర్యాదలు చేస్తారా, రాష్ట్రవ్యాప్తంగా రాచ మర్యాదల సంఘటన, రిమాండ్ ఖైదీకి రెస్టారెంట్లో బిర్యానీ, స్టేషన్లో అర్ధరాత్రి పూట మూలాకత్ లు వంటి అంశాలు సంచలనమై కూటమి ప్రభుత్వం పరువు, పోలీస్ శాఖ పరువు పోయిన కూడా ఇంకా ఈ వైసీపీ పోలీస్ వ్యవస్థ ఇలానే ఎందుకు పని చేస్తుందని శ్రీధర్ ప్రశ్నించారు. వైసీపీ నేతల కనుసనల్లో గుంటూరు జిల్లా ఎస్పీ, డీఎస్పీ పని చేస్తున్నారని, వైసీపీ నాయకులు ఆదేశాల మేరకే స్టేషన్లో రాజు మర్యాదలు రెస్టారెంట్ కి తీసుకువెళ్లారన్నారు. ఈ రాజమర్యాదల కోసం రౌడీ షీటర్ దగ్గర నుంచి పక్షులది రూపాయలు అధికారుల చేతులు మారాయని, పోలీస్ స్టేషన్లోని సీసీ కెమెరాల అజమాయిషీ ఎవరి చేతిలో ఉంటుంది, అసలు పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు ఎందుకు జరిగింది? సీసీ కెమెరాలు ఆధారంగా జరిగిన తప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారు? . ఇలాంటి అంశాలు ఎక్కడ బయటబడుతాయో అనే భయంతో తప్పు కప్పిపుచ్చుకునేందుకు కోసం పోలీసు వైఫల్యాన్ని వెలుగులోకి తెచ్చిన వారి మీద అక్రమ కేసులు నమోదు చేసి ప్రతీకార దాడులు చేస్తారా, ఇదే నా ఫ్రెండ్లీ పోలీస్ అంటే అని శ్రీధర్ రాష్ట్ర డీజీపీని నిలదీశారు. సంఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే జ్యుడీషియల్ కమిటీ వేసి విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

## నాపై కేసులు పెట్టి అధికారులంతా ఇప్పుడు హాయిగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు

**◆దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

అమరావతి (చైతన్యరథం): ఏపీ అసెంబ్లీ లాబీలో శుక్రవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో వారిపై నమోదు అయిన అక్రమ కేసులకు సంబంధించి మీడియాకు తెలియజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆగడాలను గుర్తుచేశారు. వైసీపీ పాలనలో చట్టాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. తమపై కేసు పెట్టి అధికారులంతా ఇప్పుడు హాయిగా ఉద్యోగాలు చేసుకుంటున్నారని అన్నారు. గత ఐదేళ్లలో తనపై వైసీపీ ప్రభుత్వం 27 అక్రమ కేసులు పెట్టిందన్నారు. తాజాగా రెండు కేసులను న్యాయస్థానం తప్పని కొట్టేసిందన్నారు. మరో 25 అక్రమ కేసులు తనపై ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల విలువ తీసేసేలా అక్రమ కేసులతో చట్టాన్ని వైసీపీ దుర్వినియోగం చేసిందని విమర్శించారు. తనపై కొట్టేసిన రెండు కేసులు కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం చేసి పెట్టినవే అని తెలిపారు. కేసులో బాధితులుగా తనతో పాటు ఎస్సీలూ ఉండటం గమనార్హమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు.



# ఐదేళ్లు రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన వైసీపీ బడ్జెట్‌పై మాట్లాడడం సిగ్గుచేటు

**◆గత ఐదేళ్లూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు**

**◆శాసనసభకు గైర్హాజరై మండలిలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ జగన్ రెడ్డి పైశాచికత్వం**

**◆రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వైసీపీ నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి ప్రసాద్ ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో దళిత గిరిజనులపై దాడులు, వారి హక్కుల ఉల్లంఘనలతో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జగన్ రెడ్డి విధానాలతో దళిత, గిరిజనుల భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించి దళిత గిరిజన ప్రాంతాలలో, గ్రామాలలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. కానీ జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను రద్దుచేసి ఆయా నిధులు పక్కదోవ పట్టించారని మండిపడ్డారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అనేక పథకాలను రూపొందించి తద్వారా దళిత గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా పథకాలు అన్నింటినీ రద్దుచేసి దళితులకు, గిరిజనులకు తీరని ద్రోహం చేశారని అన్నారు. ఆడబిడ్డకి పెళ్లి చేయబోయే కన్నతండ్రి అప్పులు పాలు కాకూడదని "కళ్యాణ లక్ష్మి పథకం" పెట్టి చంద్రబాబునాయుడు ఆ ఆడబిడ్డ కన్న తండ్రికి అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో దళిత, గిరిజనులు వ్యవసాయ కూలీలుగా కాకుండా సొంత భూమి కలిగిన రైతులుగా మారాలని భూమి కొనుగోలు పథకం ద్వారా దళిత గిరిజనులను యజమానులుగా చేశారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను అందించి స్వయం ఉపాధి పొందేందుకు చంద్రబాబు నాయుడు మార్గం చూపారని అన్నారు. ప్రజల పట్ల బాధ్యత గలవారు అయితే శాసనసభకు వచ్చి ప్రతిపక్షం కాకపోయినా ప్రజల పక్షంగా నిలబడి ప్రజావాణిని శాసనసభ సాక్షిగా వినిపించాలని అన్నారు. సరైన సభ్యులు లేక వైసిపి జేల చూపులు చూడటంతో శాసనమండలిలో కొంతమంది సభ్యులు కూటమి ప్రభుత్వంపై అవాస్తవాలను వ్యక్తపరుస్తూ బడ్జెట్ పై విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనన్నారు.ఒకటి రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో వైసీపీ కనుమరుగవుతుందని ఈ సందర్భంగా నరహరి వరప్రసాద్ జోస్యం చెప్పారు. ఇకనైనా వైసీపీ నాయకులు బాధ్యతగా వ్యవహరించి, ప్రజా పక్షంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# ముర్మును రాష్ట్రపతి చేయడం ఎన్డీఏ ప్రభుత్వ అదృష్టం

◆ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ



రాంచీ: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ముర్ము పేరును ప్రతిపాదించగానే.. ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని బీహార్ సీఎం నితీశ్ కుమార్ పిలుపునిచ్చిన విషయాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు.

పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనులను ప్రారంభించిన ఘనత ద్రౌపది ముర్ముదేనని ఆయన కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని మోదీ చెప్పారు. బీహార్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ సభలో ప్రధాని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని, వారి అభివృద్ధికి కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు.

సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఆదివాసీలు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని ప్రధాని తెలిపారు. ఆదివాసీలకు చదువు, సంపద, వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశామని, బడ్జెట్‌ను రూ.25 వేల కోట్ల నుంచి రూ.1.25 లక్షల కోట్లకు పెంచామని ప్రధాని తెలియజేశారు.

### ప్రధాని ఎయిర్ క్రాఫ్ట్‌కు సాంకేతిక సమస్య

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాణించాల్సిన ఎయిర్ క్రాఫ్ట్‌కు సాంకేతిక సమస్య ఎదురైంది. ఝార్ఖండ్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఢిల్లీకి ప్రధాని తిరుగు ప్రయాణం ఆలస్యమైనట్లు అధికారులు వెల్లడించారు.

ఎన్నికల ప్రచారం నిమిత్తం ప్రధాని మోదీ ఝార్ఖండ్‌లో పర్యటించారు. రెండు ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొన్నారు. వాటిని ముగించుకుని ఢిల్లీ తిరిగి వెళ్లేందుకు దేవ్‌ఘర్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే ప్రధాని ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్ సాంకేతిక లోపం తలెత్తడంతో టేకాఫ్ అవ్వలేదు.

ఇదిలావుండగా ఇదే రోజున ఝార్ఖండ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్ కూడా గంటకు పైగా నిలిచిపోయింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి అనుమతి రాకపోవడంతో గోడ్డలో ఆగిపోయింది. దీంతో రాహుల్ గాంధీ షెడ్యూలుకు ఆటంకం ఏర్పడింది. అయితే, దీనికి బీజేపీనే కారణమని కాంగ్రెస్ ఆరోపించింది. ఝార్ఖండ్‌లో ఈనెల 13న తొలి విడత పోలింగ్ జరగ్గా.. నవంబర్ 20న మహారాష్ట్రతో పాటు రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఫలితాలను వెల్లడి కానున్నాయి.

# మహారాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో విముఖత

◆ప్రజల్లో చిచ్చుపెట్టేలా బీజేపీ నేతల ప్రసంగాలు

◆ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ స్పష్టీకరణ



పుణె: మహారాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో విముఖత ఏర్పడిందని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాలతో సమాజాన్ని విభజిస్తున్నారని శరద్‌పవార్ మండిపడ్డారు. కొద్ది రోజులుగా ఆయన చేస్తున్న ప్రసంగాలు, లేవనెత్తుతున్న అంశాలను చూస్తే ఈ విషయం అర్థమవుతోందన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన పవార్ మహాయుతి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 'విడిపోతే చస్తారు' అనే నినాదంతో వారిలో భయాన్ని, అభద్రతను సృష్టిస్తున్నారని విమర్శించారు. ఆయన మాటలను బీజేపీ నాయకులు, ఎన్డీఏ మిత్రపక్షాలు సైతం వ్యతిరేకించాయన్నారు.

ఎన్సీపీలో చీలిక ఏర్పడినా తమ వర్గానిదే గెలుపు అని శరద్‌పవార్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందగలననే నమ్మకం ఉందని తెలిపారు. ప్రభుత్వంపై యువత రైతులు అసంతృప్తితో ఉన్నారని.. అదే తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో తమకు మద్దతు తగ్గుతోందని గుర్తించిన మహాయుతి సర్కారు మహిళలకు డబ్బులు పంచే పథకాలను రూపొందిస్తోందని ఆరోపించారు. కానీ.. మహిళలు డబ్బును చూడరని, అభివృద్ధి, భద్రతను కల్పించే ప్రభుత్వాలను ఆదరిస్తారని పేర్కొన్నారు. గతంలో మహారాష్ట్రలో ఎన్సీపీని కిందిస్థాయి నుంచి పటిష్ఠంగా నిర్మించడానికి శరద్‌పవార్ కలిసి ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ కృషి చేశారు. అయితే శరద్ పవార్ అజిత్ కాదని తన కుమార్తె సుప్రియ సూలేకు పార్టీ పగ్గాలు ఇవ్వాలని చూడడంతో అజిత్ ఆగ్రహంతో పార్టీ నుంచి విడిపోయారు. ఇలాంటి వ్యక్తిగత కారణాలతోపాటు పలు సైద్ధాంతిక విభేదాలూ ఎన్సీపీ చీలికకు దారి తీశాయి. ఇక ఈ ఎన్నికల్లో ఏ వర్గం అసలుదో ప్రజలు తేల్చనున్నారు.





# కేంద్ర హోం మంత్రి అమిత్ షా బ్యాగ్ తనిఖీ చేసిన ఈసీ అధికారులు

ముంబై: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం హింగోలి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం కోసం వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఈ విషయాన్ని స్వయంగా అమిత్ షా వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.

"ఎన్నికల ప్రచారం కోసం ఇక్కడకు వచ్చిన క్రమంలో నా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. నిష్పక్షపాత, ఆరోగ్యకరమైన ఎన్నికల వ్యవస్థను బీజేపీ విశ్వసిస్తోంది. ఇందుకు మనమంతా సహకరించాలి. ప్రపంచంలో శక్తిమంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్‌ను కొనసాగించడంలో మన బాధ్యతలను నిర్వర్తించాలి" అని అమిత్ షా పేర్కొన్నారు.

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల అధికారులు పలుమార్లు తనిఖీ చేయడం ఇటీవల చర్చనీయాంశమైంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఎన్నికల అధికారుల తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. దాంతో ఇది సాధారణ ప్రక్రియే అంటూ ఈసీ కూడా స్పష్టత ఇచ్చింది. అప్పటి నుంచి బ్యాగులు, హెలికాప్టర్ల తనిఖీల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బ్యాగులను అధికారులు తనిఖీ చేసిన విషయం తెలిసిందే.

# మండల-మకరవిళక్కు.. తెరుచుకున్న శబరిమల ఆలయం



తిరువనంతపురం: మండల-మకరవిళక్కు సీజన్‌లో భాగంగా కేరళలోని శబరిమల ఆలయం తెరచుకుంది. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తుల దర్శనాలకు అనుమతిస్తారు. తొలిరోజే వర్చువల్ బుకింగ్ ద్వారా దాదాపు 30 వేల మంది భక్తులు నమోదు చేసుకున్నట్లు సమాచారం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఓ గంట ముందే ఆలయాన్ని తెరచినట్లు ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు వెల్లడించింది. ఈ సీజన్‌లో దర్శన సమయాలను పొడిగించినట్లు తెలిపింది. శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ గర్భగుడిని ప్రధాన అర్చకుడు అరుణ్ కుమార్ నంబూథిరి తెరవనున్నట్లు దేవస్థానం బోర్డు పేర్కొంది.

మండల సీజన్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభమై డిసెంబర్ 26 వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 30 నుంచి మొదలయ్యే మకరవిళక్కు జనవరి 20, 2025 వరకు కొనసాగుతుంది. నిత్యం 18 గంటల పాటు దర్శనాలకు అనుమతిస్తారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. తిరిగి మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తుల దర్శనాలు ఉంటాయి.



# ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరం

◆ఆన్‌లైన్‌లోనే ప్రైమరీ స్కూల్ క్లాసులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. వాయు నాణ్యత అత్యంత దారుణంగా క్షీణించింది. మూడవ రోజు వరుసగా సివియర్ కేటగిరీ నమోదు చేసింది. ప్రపంచంలో అత్యంత కలుషితమైన రెండవ నగరంగా ఢిల్లీ నిలిచింది. ఢిల్లీలో శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 498గా నమోదు అయ్యింది. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఎయిర్ క్వాలిటీ 770గా రికార్డు అయ్యింది. ఢిల్లీలోని జహంగిర్‌పురి, బవానా, వాజిర్పుర్, రోహిణి, పంజాబీ బాగ్ ప్రాంతాల్లో అత్యధిక స్థాయిలో కాలుష్యం నమోదు అయ్యింది. ఢిల్లీలోని పాలమ్, సఫ్దర్‌జంగ్‌లో 500ఎం, 400ఎం విజిబులిటీ నమోదు అయ్యింది. ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో.. ఆ రాష్ట్ర సీఎం ఆతిషి తన ఎక్స్ ఖాతాలో ప్రకటన చేశారు. ప్రైమరీ స్కూళ్ల పిల్లలకు క్లాసులు ఆన్‌లైన్‌లోనే కొనసాగనున్నట్లు ఆమె తెలిపారు. మరో వైపు వెలుతురు సరిగా లేని కారణంగా విమానాలు, రైళ్ల రాకపోకలకు జాప్యం ఏర్పడుతోంది.

# భారీగా డ్రగ్స్‌తో పట్టుబడిన ఇరాన్ బోటు

◆8 మంది అరెస్ట్

అహ్మదాబాద్: భారీ స్థాయిలో డ్రగ్స్ ఉన్న ఇరాన్ బోటు భారత సముద్ర జల్లాల్లోకి ప్రవేశించింది. దీంతో ఇండియన్ నేవీ, ఎన్సీబీ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 700 కిలోల మెత్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8 మంది ఇరాన్ జాతీయులను అరెస్ట్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున గుజరాత్ సముద్ర తీరంలోని భారత ప్రాదేశిక జలాల్లో ఇరాన్ బోటు అనుమానాస్పదంగా కనిపించింది. అందులో డ్రగ్స్ ఉన్నట్లు నిఘా వర్గాలు సమాచారం ఇచ్చాయి.

కాగా, ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ 'సాగర్ మంథన్ – 4' అనే కోడ్‌నేమ్‌తో ఆపరేషన్ చేపట్టాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), గుజరాత్ పోలీస్‌కు చెందిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్)తో కలిసి ఆ బోటు వద్దకు చేరుకున్నారు. ఇరాన్ బోటును తనిఖీ చేశారు. అందులో ఉన్న మెత్‌గా పిలిచే 700 కిలోల మెథంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బోటులో ఉన్న 8 మంది ఇరానీయన్లను అరెస్ట్ చేశారు. ఈ డ్రగ్స్ విలువ మార్కెట్‌లో రెండు నుంచి ఐదు కోట్ల వరకు ఉంటుందని ఎన్సీబీ అధికారులు తెలిపారు. ఈ డ్రగ్స్ ఎక్కడకు, ఎవరికి సరఫరా చేసేందుకు తరలిస్తున్నారో అన్నది దర్యాప్తు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

